సాక్షి
నంద్యాల
సోమవారం ၊ 4 ၊ డిసెంబర్ ၊ 2023



అమ్మవారికి పల్లకీ సేవ

శ్రీశైలంటెంపుల్: శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామివార్ల ఉత్సవమూర్తులకు ఆదివారం పల్లకీ సేవ నిర్వహించారు. పల్లకీలో ఉత్సవమూర్తులను ఉంచి ఆలయ ప్రదక్షిణ చేశారు.



పూర్తిస్థాయిలో నీటి నిల్వ

గూడూరు: సుంకేసుల రిజర్వాయర్‌లో ఆదివారం నాటికి పూర్తిస్థాయిలో 1.20 టీఎంసీల నీరు నిల్వ ఉంది. డ్యాంకు ఎగువ ప్రాంతాల నుంచి 2,400 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది.



అలరించిన నృత్య ప్రదర్శన

మహానంది: కార్తీక మాసోత్సవం సందర్భంగా మహానంది క్షేత్ర ఆవరణలో ఆదివారం బెంగళూరు శ్రీ లాస్య ఫైన్ ఆర్ట్స్ అకాడమీ బృందం వారి కూచిపూడి నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది.

న్యూస్‌రీల్

ప్రశాంతంగా జాతీయ ఉపకార వేతన పరీక్ష

నంద్యాల(న్యూటౌన్): జిల్లాలో నేషనల్ మీన్స్ కమ్ మెరిట్(ఎన్‌ఎంఎంఎస్) జాతీయ ఉపకార వేతన పరీక్ష ఆదివారం ప్రశాంతంగా నిర్వహించినట్లు డీఈఓ సుధాకర్‌రెడ్డి, పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ గోపాల్ తెలిపారు. జిల్లాలో నంద్యాల 7, ఆత్మకూరులో 4, డోన్‌లో 4 కేంద్రాల్లో పరీక్షలు సజావుగా జరిగాయన్నారు. జిల్లాలో 3,507 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా 130 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు చెప్పారు. నంద్యాల పట్టణంలోని పరీక్ష కేంద్రాలైన ఎస్పీజీ హైస్కూల్, గుడ్‌సెప్పర్డ్ పాఠశాలలో జరిగే జాతీయ ఉపకార వేతన పరీక్షను డీఈఓ, గోపాల్, లక్ష్మీనారాయణ పరిశీలించారు. అన్ని పరీక్ష కేంద్రాల్లో డిపార్టుమెంటల్ ఆఫీసర్లు, రూట్ ఆఫీసర్లు, చీఫ్ సూపరింటెండెంట్ల ఆధ్వర్యంలో కట్టుదిట్టమైన ఏర్పాట్ల మధ్య పరీక్షలను ప్రశాంతంగా నిర్వహించినట్లు వారు తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు పరీక్ష జరిగిందన్నారు. వీరి వెంట సిబ్బంది పాల్గొన్నారు.

నేడు జగనన్నకు చెబుదాం - స్పందన

● జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్

నంద్యాల: స్థానిక కలెక్టరేట్‌లోని వైఎస్సార్ సెంటినరీ హాల్‌లో వినూత్న తరహాలో 'జగనన్నకు చెబుదాం-స్పందన' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించే ఈ కార్యక్రమానికి ఉదయం 9.30 గంటలకు జిల్లాధికారులందరూ హాజరు కావాలన్నారు. అలాగే జిల్లా కేంద్రంతో పాటు మండల, నియోజకవర్గ, డివిజన్ స్థాయిలో కూడా యథాతథంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

10 వరకే కేసీ కాల్వకు సాగునీటి సరఫరా



కేసీ కాల్వలో ప్రవహిస్తున్న సాగునీరు

జూపాడుబంగ్లా/పాములపాడు: కర్నూలు-కడప కాల్వకు ఈనెల 10వ తేదీ వరకు మాత్రమే సాగునీరు సరఫరా అయ్యే అవకాశాలున్నాయని కేసీ కాల్వ ఏఈ శ్రీనివాసనాయక్ తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సుంకేసుల జలాశయం నుంచి కేసీ కాల్వకు 2,600 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తుండగా రైతుల వినియోగానంతరం లాకిన్స్‌లా వరకు 2,114 క్యూసెక్కుల నీరు చేరుతున్నట్లు తెలిపారు. ఈ నీటిని నిప్పుల వాగుకు 1,766 క్యూసెక్కులు, తూడిచెర్ల సబ్‌చానల్ కాల్వకు 348 క్యూసెక్కుల చొప్పున సరఫరా చేస్తున్నట్లు తెలిపారు.

శ్రీశైలానికి నిలిచిన వరద

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైల జలాశయానికి సుంకేసుల నుంచి వస్తున్న వరద ప్రవాహం ఆదివారం నిలిచిపోయింది. శ్రీశైలం నుంచి శనివారం నుంచి ఆదివారం వరకు దిగువ ప్రాజెక్టులకు 3,780 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. తెలంగాణ ప్రాంతంలోని భూగర్భ జలవిద్యుత్ కేంద్రంలో 0.132 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేసి నాగార్జున సాగర్‌కు 262 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. బ్యాక్‌వాటర్ నుంచి హంద్రీనీవా సుజలస్రవంతికి 1,013 క్యూసెక్కులు, కల్వకుర్తి ఎత్తిపోతలకు 2,400 క్యూసెక్కులు నీటిని విడుదల చేశారు. ప్రస్తుతం జలాశయంలో 59.3974 టీఎంసీల నీరు నిల్వ ఉంది. డ్యామ్ నీటిమట్టం 838.30 అడుగులకు చేరుకుంది.

క్రీడల్లో మెరిసేలా.. పతకాలు గెలిచేలా!

● వ్యాయామ విద్యకు ప్రభుత్వం పెద్దపీట
● పాఠశాలలకు క్రీడా పరికరాల సరఫరా
● జిల్లాలో 1,371 పాఠశాలలకు పంపిణీ
● క్రీడల్లో రాణింపునకు అవకాశం

గోస్పాడు: విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించేలా రాష్ట్ర ప్రభుత్వం పకడ్బందీ చర్యలు చేపట్టింది. వార్షిక విద్యా క్యాలెండర్‌లో రెగ్యులర్ సబ్జెక్టులతో పాటు రోజు వారి వ్యాయామ విద్యకు సైతం ప్రాధాన్యత ఇచ్చేలా తరగతుల నిర్వహణకు రూపకల్పన చేశారు. దీనిని మరింత పటిష్టంగా అమలు చేసే క్రమంలో స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్వహణకు విద్యాశాఖ అధికారులు షెడ్యూల్ సిద్ధం చేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేసి తీర్చిదిద్దుతున్నారు. అందులో భాగంగా పాఠశాలలను ఇప్పటికే విడతల వారీగా నాడు-నేడు కింద వాటి రూపురేఖలు మార్చి విద్యార్థులకు పూర్తిస్థాయి సౌకర్యాలను కల్పించేలా చర్యలు చేపట్టి పాఠశాలలకు కోట్లాది రూపాయల నిధులు వెచ్చించి ఎంతో అభివృద్ధి చేశారు. పాఠశాలలో క్రీడలు, వ్యాయామ విద్యకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. పాఠశాలలో విద్యార్థులకు క్రీడా నైపుణ్యం పెంపొందించేలా చర్యలు చేపట్టింది. జిల్లాలో 926 ప్రాథమిక పాఠశాలలు, 160 అప్పర్ ప్రైమరీ పాఠశాలలు, 227 ఉన్నత పాఠశాలలు, 58 ఉన్నత మాధ్యమిక పాఠశాలలు ఉన్నాయి. గతంలో పాఠశాలలో వ్యాయామ విద్య అమలు చేస్తున్నప్పటికీ క్రీడా పరికరాల పంపిణీ నామమాత్రంగా ఉండేది. ఏటా కేవలం రూ.500 నుంచి రూ.1000 వరకు మాత్రమే మంజూరు చేసేవారు. ప్రస్తుతం ప్రభుత్వం విద్యార్థుల కోసం ఒక్కొక్క పాఠశాలకే వేలాది రూపాయలు ఖర్చు చేసి నాణ్యమైన క్రీడా సామగ్రిని సరఫరా చేస్తోంది. పాఠశాలల్లో వ్యాయామ విద్య అమలులో భాగంగా విద్యార్థులు ఆడుకునేందుకు వీలుగా క్రీడా సామగ్రిని రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల సరఫరా చేసింది.



పాఠశాలలకు ప్రభుత్వం అందించిన క్రీడా పరికరాలు

వ్యాయామ ఉపాధ్యాయులకు శిక్షణ

వ్యాయామ విద్య అమల్లో ఫిజికల్ డైరెక్టర్లు, ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్లపాత్ర ఎంతో కీలకం. అందుకు అనుగుణంగా జిల్లాలోని ప్రభుత్వ యాజమాన్యాల పరిధిలో పనిచేస్తున్న వ్యాయామ ఉపాధ్యాయులందరికీ వృత్తి నైపుణ్యాన్ని పెంచుకునేలా ఏర్పాటు చేశారు. దీనిలో భాగంగా నెలలో ఒకరోజు స్పోర్ట్స్ కాంప్లెక్స్ సమావేశాన్ని నిర్వహించేలా కార్యాచరణ సిద్ధం చేశారు. వ్యవస్థ ఏర్పడినప్పటి నుంచి కేవలం సబ్జెక్టు టీచర్లకు మాత్రమే కాంప్లెక్స్ సమావేశాలు నిర్వహిస్తుండేవారు. ప్రస్తుతం అలా కాకుండా వ్యాయామ ఉపాధ్యాయులకు కూడా ప్రత్యేకంగా కాంప్లెక్స్‌లో నిర్వహించేలా ఏర్పాట్లు ఈ సమావేశాలు నియోజకవర్గ కేంద్రంగా అమలయ్యేలా చర్యలు చేపట్టారు. వ్యాయామ విద్యకు ప్రభుత్వం పెద్దపీట వేసి శిక్షణ ఇవ్వడం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని వ్యాయామ ఉపాధ్యాయులు చెబుతున్నారు.

నాణ్యమైన కిట్లు

ప్రైమరీ స్కూళ్లకు 25 పరికరాలు ఉండే కిట్లు, అప్పర్ ప్రైమరీ స్కూళ్లకు 31 పరికరాలు, హైస్కూల్, ఉన్నత మాధ్యమిక పాఠశాలలకు 31 పరికరాలు ఉండే కిట్లను అందించారు. ఈ కిట్లలో వాలీబాల్, హ్యాండ్ బాల్, ఫుట్‌బాల్, బాస్కెట్ బాల్, త్రో బాల్, త్రోబాల్ నెట్, క్రికెట్ బ్యాట్, వికెట్స్ సెట్, టెన్నిస్ బాల్, ఫ్రెస్బీ, మల్టీ కలర్ హూలా, స్టెప్ హర్డిల్స్, స్కిప్పింగ్ రోప్, టెన్నికాయిట్, టెన్నికాయిట్ రింగ్, టెన్నికాయిట్ నెట్, చెస్ సెట్, వేయింగ్ మిషన్, షాట్ పుట్, డిస్కస్ రబ్బర్, స్టెప్పు హాడిలెస్, ఫ్రిస్బీ. యోగా మ్యాట్, ఫుట్ ఎయిర్ పంప్, వేయింగ్ మిషన్, షాట్ పుట్, డిస్కస్‌త్రో, మెజరింగ్ టేప్, యోగా మ్యాప్, ఫుట్ పంప్, ఫుట్ ఆల్, వెయింగ్ మిషన్ శాట్‌పుట్, డిస్కస్‌త్రో వంటి పరికరాలను పాఠశాలలకు అందించారు. ఈ కిట్లు క్రీడాకారుల సాధనకు ఎంతో అనుకూలంగా ఉండనుంది.

క్రీడాకారులకు మరింత ప్రోత్సాహం



విద్యార్థులను క్రీడల వైపు ప్రోత్సహించేందుకు ప్రభుత్వం క్రీడా సామగ్రి సరఫరా చేసింది. గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రతి పాఠశాలకు క్రీడా పరికరాలు పంపిణీ చేసి ప్రభుత్వం ఎంతో మేలు చేసింది. ఆటలపై ఆసక్తి ఉన్న విద్యార్థులకు సరైన ఆట పరికరాలు లేక ఇబ్బందులు పడుతుండేవారు. పస్తుతం ఆ పరిస్థితి లేకుండా పుష్కలంగా క్రీడా పరికరాలు ప్రభుత్వం అందించడంతో మా తరపున కృతజ్ఞతలు.

– విశ్వనాథ్, క్విట్ ఇండియా స్టేట్ కో ఆర్డినేటర్, దీబగుంట్ల పీడీ, గోస్పాడు

స్పోర్ట్స్ కాంప్లెక్స్‌ల ఏర్పాటుతో ఉపయోగం



ఎప్పుడూ లేని విధంగా స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లు ఏర్పాటు చేయడం వ్యాయామ ఉపాధ్యాయులకు ఎంతో ఉపయోగకరంగా మారాయి. విద్యార్థుల కోసం సరఫరా చేసిన క్రీడా పరికరాలు చాలా నాణ్యతగా ఉన్నాయి. విద్యార్థుల వ్యాయామ విద్యకు ప్రభుత్వం అందించిన ఆట పరికరాలు వారికి ఎంతగానో ఉపయోగపడటంతో పాటు క్రీడల్లో మరింత రాణించేందుకు దోహదపడుతాయి.

– శివకుమార్, స్కూల్ గేమ్స్ సెక్రటరీ నంద్యాల జిల్లా

క్రీడాకారులకు మంచి అవకాశం



ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల్లో చాలా మంది మంచి క్రీడాకారులు ఉన్నారు. వారికి అవసరమైన శిక్షణ ఇస్తే మరింత రాటుదేలితో క్రీడల్లో ఉన్నత స్థాయిలో రాణించేందుకు వీలుగా ఉంటుంది. ప్రైమరీ పాఠశాలల నుంచి వ్యాయామ విద్యను ప్రోత్సహిస్తే భవిష్యత్‌లో ఉత్తమ క్రీడాకారులుగా ఎదిగి పతకాలు సాధిస్తారు. క్రీడలపై ఆసక్తి ఉన్నవారికి ఈ పరికరాలు ఎంతో ఉపయోగకరంగా మారుతాయి.

– విజయరావు, పీఆర్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, గోస్పాడు

ఆనందంగా ఉంది



పాఠశాలలో ప్రతిరోజు వ్యాయామ విద్య అందిస్తున్నారు. గతంలో ఇన్ని రకాల ఆట వస్తువులు అందుబాటులో లేక ఇబ్బందులు పడుతుండే వాళ్లం. ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి పాలనలో ప్రభుత్వ పాఠశాలలో చదివే మాలాంటి పేద విద్యార్థులకు ఎంతో మేలు చేస్తున్నారు. ఆట వస్తువులను అందించి ఇబ్బందులు లేకుండా చేయడం మాకెంతో ఆనందంగా ఉంది.

– జాహ్నవి, 9వ తరగతి విద్యార్థిని, దీబగుంట్ల

సద్వినియోగం చేసుకోవాలి



ప్రభుత్వం మంజూరు చేసిన క్రీడా పరికరాలు జిల్లాలోని పాఠశాలన్నింటికి సరఫరా చేశాం. ప్రభుత్వ పాఠశాలల్లో వ్యాయామ విద్య సక్రమంగా అందించేందుకు ప్రభుత్వం విద్యార్థుల కోసం క్రీడా పరికరాలను పాఠశాల స్థాయిని బట్టి అందజేసింది. జిల్లాలోని 1,371 పాఠశాలలకు ఆట వస్తువులు అందాయి. ఈ అవకాశాన్ని పాఠశాలలోని ఫిజికల్ డైరెక్టర్లు, పీఈటీలు విద్యార్థులకు సక్రమంగా ఉపయోగించేలా చర్యలు చేపట్టాలి.

– సుధాకర్‌రెడ్డి, డీఈఓ, నంద్యాల

సీఎం జగన్ వెంట నడుద్దాం



మాట్లాడుతున్న రాష్ట్ర మత్స్యశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు

● రాజ్యసభ సభ్యులు మోపిదేవి,
మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు

కర్నూలు(అర్బన్): బడుగు, బలహీన వర్గాలకు అన్ని రంగాల్లో సమాన అవకాశాలు కల్పిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెంట నడవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకటరమణ, రాష్ట్ర మత్స్యశాఖా మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అన్నారు. ఆంధ్రప్రదేశ్ సంప్రదాయ మత్స్యకారుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక పెద్దపాడు రోడ్డులోని టీ శేషన్ననగర్‌లో నిర్వహించిన కార్తీక మాస వనభోజన మహోత్సవ కార్యక్రమానికి వీరు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. కర్నూలు, పాణ్యం ఎమ్మెల్యేలు హఫీజ్‌ఖాన్, కాటసాని రాంభూపాల్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు ఎస్వీ మోహన్‌రెడ్డి, లబ్బి వెంకటస్వామి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాజ్యసభ సభ్యులు మోపిదేవి మాట్లాడుతూ.. మత్స్యకారుల కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి ఎంపీ నిధుల నుంచి ఆర్థిక సహకారం అందిస్తానన్నారు. మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మత్స్యకారులను అన్ని విధాలా ఆదుకుంటున్నారన్నారు. సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన మత్స్యకారులకు రాజకీయంగా సముచిత స్థానాన్ని ఇస్తున్నారన్నారు. ఆదుకుంటున్న ప్రభుత్వానికి అండగా నిలవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో తెలుగు, బెస్త, గంగపుత్ర సంఘం నేతలు, కుటుంబ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. మంత్రి వెంట కర్నూలు, నంద్యాల మత్స్యశాఖ డీడీలు శ్యామలమ్మ, రాఘవరెడ్డి ఉన్నారు.

సంగమేశ్వరుడికి తొలి పూజ

కొత్తపల్లి: సప్తనదుల సంగమ ప్రాంతంలో వెలసిన ప్రాచీన సంగమేశ్వరాలయం కృష్ణా జలాల నుంచి పూర్తిగా బయటపడటంతో గర్భాలయంలోని వేపధారు శివలింగానికి ఆదివారం తొలిపూజ చేశారు. ఆలయ పురోహితులు స్వామి వారికి కుంకుమార్చన, పుష్పార్చన, మంగళహారతి, కృష్ణాజలాలతో అభిషేకం వంటి విశేషపూజా కార్యక్రమాలు నిర్వహించారు.



సంగమేశ్వరంలోని వేపధారు శివలింగం

శ్రీగిరికి పోటెత్తిన భక్తజనం

శ్రీశైలంటెంపుల్: కార్తీకమాసం, ఆదివారం సెలవు రోజు కావడంతో ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి సైతం వేలాది మంది భక్తులు శ్రీగిరి చేరుకున్నారు. వేకువజామునే పుణ్యస్నానాలాచరించిన భక్తులు కార్తీకదీపారాధన, ప్రత్యేక నోములు నోచుకుని మల్లన్న దర్శనానికి బారులుదీరారు. భక్తుల రద్దీతో ఆలయ శీఘ్ర, అతిశీఘ్ర దర్శన క్యూలన్నీ నిండిపోయాయి. భక్తులందరికీ స్వామివారి సౌకర్యవంతమైన దర్శనం కలిగేలా స్వామివారి అలంకార దర్శనాన్ని మాత్రమే భక్తులకు కల్పించారు. ఆలయ క్యూలైన్లలో వేచి ఉన్నభక్తులకు అల్పాహారం, తాగునీరు, వేడిపాలు, బిస్కెట్లు పంపిణీ చేశారు. దేవస్థానం ఈఓ డి.పెద్దిరాజు దర్శన క్యూలైన్లను, ఆర్జిత సేవా క్యూలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ పలు సూచనలు చేశారు. భక్తులందరు కార్తీకదీపారాధన చేసుకునేందుకు వీలుగా ఆలయ ఉత్తర మాడవీధి, గంగాధర మండపం వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. అన్నదాన భవనంలో ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 3.30 గంటల వరకు అన్నప్రసాద వితరణ, సాయంత్రం 6.30 గంటల నుంచి అల్పాహారం భక్తులకు అందజేశారు.



భక్తులతో నిండిన క్యూ కంపార్ట్‌మెంట్

నేడు లక్షదీపోత్సవం

శ్రీశైల మహాక్షేత్రంలో కార్తీక మూడవ సోమవారం పురస్కరించుకుని ఆలయ పుష్కరిణి వద్ద లక్షదీపోత్సవ కార్యక్రమం, పుష్కరిణికి దశ విధహారతుల కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. ఉభయదేవాలయాల ప్రధాన అర్చకులు ఈ కార్యక్రమాల్లో పాల్గొని శాస్త్రోక్తంగా హారతులిస్తారు.



కార్తీకదీపాలను వెలిగిస్తున్న భక్తులు

95.10 శాతం పింఛన్ల పంపిణీ పూర్తి

నంద్యాల(న్యూటౌన్): జిల్లాలో డిసెంబర్ నెల వైఎస్సార్ పింఛన్ కానుక పంపిణీ కార్యక్రమం చురుగ్గా సాగుతుంది. పింఛన్ల పంపిణీ ఆదివారం కూడా కొనసాగింది. సాయంత్రం 7గంటల వరకు జిల్లాలో 95.10 శాతం పింఛన్లను పంపిణీ చేసినట్లు డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్‌రెడ్డి తెలిపారు. 60 ఏళ్లు పైబడిన వారు ఆర్‌బీఐఎస్ ముఖ గుర్తింపు ద్వారా పింఛన్ పొందే అవకాశం ప్రభుత్వం కల్పించిందన్నారు.

పెద్దాసుపత్రిలో నాణ్యమైన ల్యాబొరేటరీ సేవలు



మాట్లాడుతున్న డాక్టర్ పద్మ విజయశ్రీ

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో కార్పొరేట్‌కు దీటుగా నాణ్యమైన ల్యాబొరేటరీ సేవలు అందిస్తున్నామని బయోకెమిస్ట్రీ హెచ్‌వోడి డాక్టర్ పద్మ విజయశ్రీ చెప్పారు. డిపార్ట్‌మెంట్ ఆఫ్ బయోకెమిస్ట్రీ ఆధ్వర్యంలో ఆదివారం కర్నూలు మెడికల్ కాలేజీలో జోనల్ సీఎంఈ నిర్వహించారు. జోనల్ స్థాయిలో వివిధ కాలేజీల నుంచి బయోకెమిస్ట్రీ విభాగాల పీజీలు హాజరయ్యారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్‌గా వ్యవహరించిన డాక్టర్ పద్మవిజయశ్రీ మాట్లాడుతూ కర్నూలు మెడికల్ కాలేజీలోని అన్ని విభాగాల్లో అత్యాధునిక వైద్యపరికరాలు అందుబాటులో ఉన్నాయన్నారు. నాణ్యమైన, కచ్చితమైన నివేదికలు రోగులకు ఇస్తున్నట్లు తెలిపారు. నిపుణులైన వైద్యులతో పాటు టెక్నీషియన్లు అందుబాటులో ఉన్నారన్నారు. ఎన్‌ఆర్‌ఐ మెడికల్ కాలేజీ నుంచి డాక్టర్ శివప్రబోద్, మంగళగిరి ఎయిమ్స్ నుంచి డాక్టర్ నిచ్చెన మెట్ల గౌతమ్, హైదరాబాద్‌లోని నిమ్స్ నుంచి డాక్టర్ ఎం. విజయభాస్కర్, కర్నూలు మెడికల్ కాలేజీ నుంచి డాక్టర్ సి. గాయత్రి ప్రసంగించారు. కార్యక్రమానికి పరిశీలకులుగా అనాటమీ ప్రొఫెసర్ డాక్టర్ టి. శోభాదేవి, కాలేజ్ కో ఆర్డినేటర్‌గా వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ సాయిసుధీర్ వ్యవహరించారు.

పిల్లల చదువుకు ఇక భయం లేదు



నాకు ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు, పెద్దోడు ఇంటర్ పూర్తి చేశాడు. మిగతా ముగ్గురు మా ఊరి జెడ్పీ పాఠశాలలో చదువుతున్నారు. ఇప్పుడున్న పరిస్థితుల్లో పిల్లలను ప్రైవేటు బడికి పంపాలంటే పేదోళ్లకు సాధ్యమయ్యే పని కాదు. ఫీజులు, పుస్తకాలు, యూనిఫాం, బ్యాగులు.. ఇలా చాలా ఖర్చు వస్తుంది. జగనన్న పాలనలో ప్రభుత్వ బడులు బాగుపడ్డాయి. ఇప్పుడు సమయానికి ఉపాధ్యాయులు బడికి వస్తున్నారు, పిల్లలు చదువుపై శ్రద్ధ చూపుతున్నారు. జగనన్న విద్యా కానుక కిట్లు చాలా బాగున్నాయి. 6వ తరగతి చదువుతున్న మా చిన్న కుమారుడు అమ్మ ఒడి వస్తుంది. మధ్యాహ్నం బడిలో మంచి భోజనం పెడుతున్నారు. పేదోళ్లకు ఎన్నో పథకాలు అందిస్తున్నారు. గతంలో ఇవ్వన్నీ లేవు. పేద పిల్లలకు మంచి చదువు చెప్పించాలనుకుంటున్న జగనన్నకు హ్యాట్సాఫ్ చెప్పాల్సిందే.

– మహమ్మద్‌రఫీ, హమాలీ చాగలమర్రి



సంక్షేమ పథకాలు ఆదుకున్నాయి



జగనన్న ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు మా కుటుంబాన్ని ఆదుకున్నాయి. మాది మధ్యతరగతి కుటుంబం. నా భర్త మల్లికార్జున ప్రైవేటు ఉద్యోగం చేసేవాడు. ఆ కంపెనీ మూతపడటంతో కుటుంబ పోషణ ఇబ్బంది కరంగా మారింది. ఈ నేపథ్యంలో సీఎం జగనన్న ఇచ్చిన అమ్మఒడి, పొదుపు రుణమాఫీ, వైఎస్సార్ ఆసరా, సున్నావడ్డీ, జగనన్నతోడు, పథకాల ద్వారా వచ్చిన మొత్తంతో మా కుటుంబ కష్టాలు గట్టెక్కాయి. ఈ క్రమంలోనే పొదుపు సంఘంలో రుణం తీసుకొని పేపర్ ప్లేట్ల మిషన్ కొనుగోలు చేశాను. సొంతంగా పేపర్‌ప్లేట్లు తయారు చేయటం నేర్చుకున్నాను. నా భర్త సొంత ఆటోలోనే పేపర్ ప్లేట్లు మార్కెట్‌లో విక్రయిస్తుంటాడు. ఇప్పుడిప్పుడే ఆర్థికంగా కుటుంబం కుదటపడింది. జగనన్న అమలు చేస్తున్న సంక్షేమ పథకాలలో మహిళలకు పెద్దపీట వేయడంతో మహిళలు స్వ యం ఉపాధి రంగాల్లో రాణిస్తున్నారనేందుకు నేను నిదర్శనం. మాలాంటి పేదలకు ఎంతో సాయం చేసిన సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మళ్లీ గెలవాలి.

– కృష్ణవేణి, జూపాడుబంగ్లా

క్లుప్తంగా

భక్తిభావాన్ని పెంపొందించుకోవాలి

● టీటీడీ ఈఓ ధర్మారెడ్డి



గ్రామోత్సవ వాహనానికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న టీటీడీ ఈఓ ధర్మారెడ్డి

జూపాడుబంగ్లా: ప్రతి ఒక్కరూ హిందూధర్మ సంప్రదాయాలను పాటించటంతో పాటు భక్తి భావాన్ని పెంపొందించుకోవాలని టీటీడీ ఈఓ ధర్మారెడ్డి అన్నారు. ధర్మారెడ్డి స్వగ్రామమైన పారుమంచాలలో నూతనంగా నిర్మించిన సీతా రామాంజనేయస్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠోత్సవ కార్యక్రమం ఆదివారం ప్రారంభమైంది. ఆలయంలో ప్రతిష్ఠించనున్న స్వామివార్ల విగ్రహాలను ప్రత్యేక వాహనంలో ఉంచి గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. ముందుగా గ్రామోత్సవ వాహనానికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం టీటీడీ ఈఓ ధర్మారెడ్డి ఊరేగింపును ప్రారంభించారు. కార్యక్రమంలో ఆళ్ల నాగేశ్వరరెడ్డి, నర్రెడ్డుల శ్రీనివాసరెడ్డి, తర్తూరు సర్పంచ్ పీఎం నాగిరెడ్డి, ఆలయ ఈఓ వెంకటరమణ, పోచ హేమశేఖర్ రెడ్డి, పోచ లోకేశ్వరరెడ్డి, ఈదుల నారాయణ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రేపు శ్రీశైలానికి చంద్రబాబు నాయుడు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల భ్రమరాంబా మల్లికార్జున స్వామివార్ల దర్శనార్థం టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు మంగళవారం శ్రీశైలం రానున్నట్లు సమాచారం. మంగళవారం ఉదయం 11 గంటలకు అమరావతి నుంచి ప్రత్యేక హెలికాప్టర్‌లో సున్నిపెంట హెలిపాడ్‌కు చేరుకుంటారు. సున్నిపెంట నుంచి రోడ్డు మార్గం ద్వారా శ్రీశైలాలయానికి చేరుకుంటారు. స్వామివార్లను దర్శనం, ప్రత్యేక పూజలు నిర్వహించుకున్న అనంతరం ఆయన తిరుగు ప్రయాణమవుతారు.

ఆటో బోల్తా.. విద్యార్థి మృతి

తుగ్గలి : ఆటో బోల్తా పడి ఓ విద్యార్థి మృతి చెందాడు. తుగ్గలి ఎస్‌ఐ మల్లికార్జున తెలిపిన వివరాల మేరకు..పెండేకల్లు ఇండ్ల కాశీం, సుశీలమ్మల కుమారుడు ప్రతాప్(17) పొలం నుంచి ఆటోలో టమాట బాక్సులు వేసుకుని శనివారం సాయంత్రం పత్తికొండ మార్కెట్‌కు వెళ్లాడు. టమాట అమ్ముకుని తిరిగి గ్రామానికి వస్తుండగా మార్గమధ్యలో ఎద్దులదొడ్డి సమీపంలో అదుపు తప్పి ఆటో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ప్రతాప్ తీవ్రంగా గాయపడ్డాడు. బాధితుడ్ని పత్తికొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం వైద్యుల సూచనల మేరకు మెరుగైన వైద్యం కోసం కర్నూలుకు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. ప్రతాప్ డోన్‌లో ఇంటర్ రెండో సంవత్సరం చదువుతున్నాడు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

పాము కాటుతో మహిళ మృతి

వెల్దుర్తి(కృష్ణగిరి): పాముకాటుకు గురైన మహిళ చికిత్స పొందుతూ కొలుకోలేక మృతి చెందిన ఘటన మండల పరిధిలోని బోయినపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు.. సి. బెళగల్ మండలం మారందొడ్డి గ్రామానికి చెందిన దేశపోగు ప్రేమరాజుకు కృష్ణగిరి మండలం ఎర్రగుడికి చెందిన సరోజ(32)తో 19ఏళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. రెండేళ్లుగా వీరు బతుకుదెరువు కోసం వెల్దుర్తి మండలం బోయినపల్లికి వచ్చారు. ఈ నెల 2న అర్ధరాత్రి సమయంలో సరోజను పాముకాటు వేసింది. ఆటోలో కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ కోలుకోలేక ఆదివారం సాయంత్రం మృతి చెందినట్లు ఎస్‌ఐ తెలిపారు.



కర్నూలు: బాలికల నృత్య ప్రదర్శన



కర్నూలు: వనభోజన కార్యక్రమానికి హాజరైన గంగపుత్రులు



పత్తికొండ: కమ్మ సంఘం ఆధ్వర్యంలో ఉసిరి చెట్టుకు పూజలు

ఉల్లాసంగా.. ఉత్సాహంగా

ఉమ్మడి కర్నూలు జిల్లాలో కార్తీక వనభోజన కార్యక్రమాలు ఆదివారం ఉల్లాసంగా.. ఉత్సాహంగా కొనసాగాయి. వివిధ కుల సంఘాల ఆధ్వర్యంలో సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా వేడుకలు నిర్వహించారు. భక్తితో ఉసిరి చెట్టుకు పూజలు చేశారు. మహిళలు, చిన్నారులు, పెద్దలు పాల్గొని సామూహిక వనభోజనాలను చేశారు. ఆయా కార్యక్రమాలకు ప్రజాప్రతినిధులు హాజరయ్యారు. వివిధ పోటీలు నిర్వహించి విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు.

– సాక్షినెట్‌వర్క్



ఎమ్మిగనూరు: వాల్మీకి పెద్దలను సన్మానిస్తున్న వనభోజన సమితి సభ్యులు



బనగానపల్లె: కోలాటం వేస్తున్న మహిళలు



కర్నూలు: ఓంకార రూపాన్ని పూలతో అలంకరిస్తున్న కుర్ని కులస్తులు



నంద్యాల: బహుమతులు అందుకున్న చిన్నారులతో ఆర్యవైశ్య సంఘం పెద్దలు



బేతంచెర్ల: పూజలు చేసుస్తున్న రెడ్డి సంఘం నాయకులు

ఆదోనిలో ఐదిళ్లలో చోరీ

● రూ.3 లక్షలు నగదు, 22 తులాల బంగారం, 50 తులాల వెండి ఆభరణాల అపహరణ



బీరువాలోని వస్తువులను చెల్లాచెదురుగా పడేసిన దృశ్యం

ఆదోనిఅర్బన్: పట్టణంలోని తిరుమలనగర్, బాబా గార్డెన్ కాలనీల్లో ఆదివారం తెల్లవారుజామున ఐదిళ్లల్లో చోరీ జరిగింది. రూ.3 లక్షలు నగదు, 22 తులాల బంగారం, 50 తులాల వెండి ఆభరణాలు, 25 వేలు విలువ చేసే ఒక సెల్‌ఫోన్‌ను అపహరించారు. బాధితులు పోలీసులకు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రిటైర్డ్ ఆర్టీసీ కండక్టర్ శివరామిరెడ్డి ఈనెల 1వ తేదీన ఇంటికి తాళం వేసి బెంగళూరులో ఉన్న కుమార్తె ఇంటికి వెళ్లారు. అదే అదునుగా భావించి ఇంటి, బీరువా తాళాలు పగలగొట్టి రూ.86 వేలు నగదు, 10 తులాల బంగారాన్ని ఎత్తుకెళ్లినట్లు శివరామిరెడ్డి కుమారుడు విష్ణువర్ధన్‌రెడ్డి తెలిపారు. అదేవిధంగా గోపాల్‌రెడ్డి, విశ్వనాథ్ శెట్టి గుంతకల్‌లోని కసాపురం ఆంజనేయ స్వామి దర్శనం కోసం శనివారం సాయంత్రం వెళ్లారు. ఆదివారం తెల్లవారుజామున గోపాల్‌రెడ్డి ఇంటిలోని బీరువా తాళాలను పగలగొట్టి రూ.50 వేలు నగదు, రెండు తులాల బంగారం, 50 తులాల వెండి ఆభరణాలు దోచుకెళ్లారు. విశ్వనాథ్‌శెట్టి ఇంట్లో రూ.4 వేలు నగదు దోచుకెళ్లారు. సీఆర్‌పీఎఫ్ ఉద్యోగి గురురాజా భార్య స్రవంతి ఆదోనిలోని అమ్మ ఇంటికి వెళ్లింది. ఆమె ఇంటి, బీరువా తాళాలను పగలగొట్టి రూ.60 వేలు నగదు, రూ.25 వేలు విలువచేసే ఒక సెల్‌ఫోన్‌ను దొంగలించారు. సాకరే పద్మావతి వారం రోజులక్రితం ఇంటికి తాళం వేసి కూతురు ఇంటికెళ్లింది. ఆమె ఇంట్లో రూ.లక్ష నగదు, 10 తులాల బంగారం ఎత్తుకెళ్లారు. బాధితుల ఫిర్యాదు మేరకు త్రీటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. క్లూస్ టీంను రప్పించి చర్యలు తీసుకుంటున్నట్లు పోలీసులు తెలిపారు.

రైలు నుంచి జారిపడి మృత్యువాత

వెల్దుర్తి(కృష్ణగిరి): వేగంగా వెళ్తున్న రైలు నుంచి ప్రమాదవశాత్తు జారిపడి ఓ వ్యక్తి మృతి చెందాడు. రైల్వే ఎస్‌ఐ శ్రీనివాసరావు తెలిపిన వివరాల మేరకు... ఉత్తర ప్రదేశ్ రాష్ట్రంలోని గోవావ జిల్లా, నాగవ జైత్పూర్ గ్రామానికి చెందిన దిపక్‌గొండ్(30)తోపాటు ఇతని స్నేహితులు రాహుల్‌గౌర్, చంద్రకేష్ యాదవ్‌లు బతుకుదెరువు కోసం లక్నో నుంచి యెశ్వంత్‌పూర్‌కు నవంబర్ 30న ట్రైన్ నెంబర్ 22684లో ప్రయాణం చేస్తున్నారు. ఈ నెల 2న వెల్దుర్తి నుంచి బోగోలు స్టేషన్ల మధ్యలో రైలు వెళ్తున్న సమయంలో దిపక్‌గొండ్ స్లీపర్ నుంచి చెత్త బ్యాగ్‌ను తీసుకుని బయటకు వేసే సమయంలో ప్రమాదవశాత్తు కాలు జారి కిందపడిపోయాడు. వెంటనే స్నేహితులు చైన్ లాగి రైలును ఆపారు. బలమైన రక్తగాయాలు కావడంతో బోగోలు స్టేషన్ మాస్టర్ వెంటనే 108లో డోన్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం కర్నూలు సర్వజన ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందినట్లు ఎస్‌ఐ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఆయన తెలిపారు.

మల్లన్న సేవలో ఎస్టీ కమిషన్ చైర్మన్




చైర్మన్‌కు స్వాగతం పలుకున్న ఈఓ పెద్దిరాజు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామివార్లను ఆదివారం రాత్రి ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డీవీజీ శంకరరావు దర్శించుకున్నారు. శ్రీశైలం చేరుకున్న వీరికి స్థానిక భ్రమరాంబా అతిథిగృహం వద్ద ఈఓ డి.పెద్దిరాజు పుష్ప గుచ్ఛాన్ని అందించి ఆహ్వానం పలికారు. అనంతరం చైర్మన్ స్వామిఅమ్మవార్ల దర్శనార్థం ప్రధానాలయ రాజగోపురం వద్దకు చేరుకోగా వీరికి ఆలయ మర్యాదలతో వేదపండితులు స్వాగతం పలికారు. అనంతరం వీరు స్వామిఅమ్మవార్లను ప్రత్యేకంగా దర్శించుకున్నారు.

నాటు వైద్యులపై కేసు నమోదు

కర్నూలు(హాస్పిటల్): నాటు వైద్యం చేస్తున్న ముగ్గురు మహిళలపై స్థానిక వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. శరీన్‌నగర్‌కు చెందిన రమీజాబీ తన కూతురుకు అనారోగ్యం ఉంటే జొహరాపురంలో నాటు వైద్యం చేసే పార్వతమ్మ, సుజాత, రత్నమ్మలను కలిసి చికిత్స చేయించింది. అయితే వారు ఇచ్చిన మందులు తిని కూతురు తీవ్ర అనారోగ్యం పాలు కావడంతో ఆ ముగ్గురిపై రమీజాబి పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో ముగ్గురు మహిళలపై పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు. ఇందులో పార్వతమ్మ అనే మహిళ నన్నూరులో జరిగిన జంటహత్యల కేసులో జైలుకు సైతం వెళ్లి వచ్చింది.

నీటికుంటలో మహిళ మృతదేహం



నీటికుంటలో మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసు

పాణ్యం: మండల కేంద్రమైన పాణ్యంలోని చెరువు వద్ద ఉన్న నీటికుంట(గుండాల)లో ఆదివారం ఓ మహిళ మృతదేహం లభ్యమైనట్లు ఎస్‌ఐ అశోక్ తెలిపారు. గ్రామస్తులు ఇచ్చిన సమాచారం మేరకు నీటికుంటలో తెలియాడుతున్న మహిళా మృతదేహం వద్దకు వెళ్లి పరిశీలించామన్నారు. మృతురాలు పాణ్యం గ్రామానికి చెందిన కై ప సుబ్బలక్ష్మమ్మ(48)గా గుర్తించినట్లు చెప్పారు. నాలుగు రోజుల క్రితం ఈమె దుస్తులు ఉతికేందుకు నీటికుంట వద్దకు వచ్చిందని, అప్పటి నుంచి కనిపించకపోవడంతో పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశామని బంధువులు తెలిపారు. మృతురాలికి భర్త సుధాకర్, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

ప్రభుత్వ డ్రైవర్ల సంక్షేమానికి కృషి



అబ్దుల్‌హమీద్, ఇలియాస్ బాషాలను సత్కరిస్తున్న ప్రభుత్వ వాహన డ్రైవర్లు

కర్నూలు(అగ్రికల్చర్): ప్రభుత్వ వాహన డ్రైవర్ల సంక్షేమానికి కృషి చేస్తానని ఆల్ ఇండియా గవర్నమెంట్ డ్రైవర్స్ ఫెడరేషన్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ జి.అబ్దుల్‌హమీద్ తెలిపారు. కర్నూలు జిల్లాకు చెందిన ప్రభుత్వ వాహన డ్రైవర్లు అయిన అబ్దుల్‌హమీద్, ఎస్.ఇలియాస్ బాషాలకు ఆల్ ఇండియా గవర్నమెంట్ డ్రైవర్స్ ఫెడరేషన్‌లో కీలకమైన పదవులు లభించాయి. ఈ నేపథ్యంలో ఆదివారం కర్నూలు ఏపీఎ కార్యాలయం ప్రాంగణంలో అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా అబ్దుల్‌హమీద్ మాట్లాడుతూ.. 2006 నుంచి 2016 వరకు జిల్లా అధ్యక్షుడిగా తాను అందించిన సేవలను గుర్తించారన్నారు. డ్రైవర్లు ఎదుర్కొంటున్న అన్ని రకాల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తానన్నారు. ఫెడరేషన్ జాయింట్ సెక్రటరీ ఇలియాస్ బాషా మాట్లాడుతూ.. ప్రభుత్వ వాహన డ్రైవర్ల సంక్షేమానికి మరింత పాటు పడతామన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ వాహన డ్రైవర్లు బాలస్వామి, షబ్బీర్‌బాషా, విజయకుమార్, శ్రీనివాసులు, మగ్బుల్ తదితరులు పాల్గొన్నారు.

పోటీతత్వంతో కరాటేలో రాణించాలి



కరాటే చాంపియన్‌షిప్ ప్రారంభ కార్యక్రమంలో మాట్లాడుతున్న మేయర్ బీవై రామయ్య



పోటీలకు హాజరైన క్రీడాకారులు

కర్నూలు (టౌన్) : మార్షల్ ఆర్ట్స్‌లో పోటీతత్వంతో రాణించాలని కర్నూలు నగర మేయర్ బీవై రామయ్య అన్నారు. ఆదివారం స్థానిక నంద్యాల చెక్‌పోస్టు సమీపంలోని దేవి ఫంక్షన్ హాలులో దక్షిణాది రాష్ట్రాల కరాటే చాంపియన్‌షిప్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను మేయర్ ప్రారంభించి మాట్లాడారు. క్రీడలను ప్రోత్సహించడం, క్రీడాకారులను వెలుగులోకి తీసుకురావడం కోసం రాష్ట్ర వ్యాప్తంగా 50 రోజుల పాటు ఆడుదాం- ఆంధ్ర పేరుతో ప్రభుత్వం మెగా క్రీడా పోటీలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు రామాంజనేయులు, పోటీల నిర్వహణ కార్యదర్శి ఫయాజ్ అహ్మద్, ఆదర్శ విద్యా సంస్థల అధిపతి డాక్టర్ హరికిషన్, పోటీల నిర్వాహకులు జగదీష్, గౌస్, ఆరిఫ్ హుస్సేన్ పాల్గొన్నారు.

ఏపీ హాకీ పోటీల అబ్జర్వర్‌గా దాసరి సుధీర్



కర్నూలు (టౌన్): ఆంధ్రప్రదేశ్ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్-19 రాష్ట్ర స్థాయి హాకీ పోటీలకు అబ్జర్వర్‌గా మున్సిపల్ ఉన్నత పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ దాసరి సుధీర్ ఎంపికయ్యారు. ఈ మేరకు స్కూల్ ఎడ్యుకేషన్ రాష్ట్ర కార్యదర్శి ఆదివారం సాయంత్రం ఉత్తర్వులు జారీ చేశారు. ఈయన కర్నూలు జిల్లా హాకీ సంఘం కార్యదర్శి, మున్సిపల్ ఫిజికల్ డైరెక్టర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా, జాతీయ స్థాయి క్రీడాకారుడిగా, ఎన్నో సార్లు రాష్ట్ర స్థాయి హాకీ పోటీల్లో పాల్గొన్న అనుభవం ఉంది. ఈ నెల 8 నుంచి 10 వ తేదీ వరకు విశాఖపట్నం జిల్లా నక్కపల్లిలో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు ఆయనను ఎంపిక చేయడంపై పలు క్రీడాసంఘాల ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు.

వైభవంగా మల్లన్న కల్యాణం



ప్రత్యేక అలంకరణలో స్వామి అమ్మవార్లు

శ్రీశైలంటెంపుల్: ధర్మ ప్రచార కార్యక్రమంలో భాగంగా ఆదివారం రాత్రి నెల్లూరు వీఆర్‌సీ గ్రౌండ్‌లో శ్రీశైల మల్లికార్జున, భ్రమరాంబ కల్యాణోత్సవం కనులపండువగా సాగింది. ఈ కల్యాణోత్సవంలో లోకకల్యాణాన్ని కాంక్షిస్తూ ముందుగా అర్చకస్వాములు కల్యాణోత్సవ సంకల్పాన్ని పఠించారు. అనంతరం కల్యాణం నిర్విఘ్నంగా జరగాలని గణపతి పూజ జరిపించి,స్థల శుద్ధి కోసం పుణ్యాహవచనం చేశారు. అనంతరం కంకణధారణ, యజ్ఞోపవీతం, కన్యావరణ మంత్రాలు పఠించారు. స్వామివారికి మధుపర్కం సమర్పించి స్వామిఅమ్మవార్లకు వస్త్రాలను సమర్పించి, బాషిక ధారణ చేశారు. అనంతరం గౌరీపూజ, స్వామిఅమ్మవార్ల మధ్య తెరసెల్లను ఏర్పాటు చేసి మహాసంకల్పం పఠనం చేశారు. అనంతరం సుముహూర్తం సమయంలో స్వామిఅమ్మవార్లకు జీలకర్ర, బెల్లం సమర్పించి, మాంగల్య పూజను జరిపించి మాంగల్యధారణ జరిపించారు. అనంతరం తలంబ్రాలు, బ్రహ్మముడి కార్యక్రమాలను జరిపి భక్తులకు తీర్థప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో పర్యవేక్షకులు సి.మధుసూదన్‌రెడ్డి, సీనియర్ అసిస్టెంట్ జి.రవి, అర్చకులు, వేదపండితులు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఢిల్లీకి వాల్మీకి నేతల బృందం



నినాదాలు చేస్తున్న వీఆర్‌పీఎస్ నేతలు

కర్నూలు(అర్బన్): వాల్మీకి/ బోయల ఎస్టీ రిజర్వేషన్ బిల్లును పార్లమెంట్‌లో ఆమోదించాలనే డిమాండ్‌పై వాల్మీకి రిజర్వేషన్ పోరాట సమితి (వీఆర్‌పీఎస్) వ్యవస్థాపక అధ్యక్షులు ఎం సుభాష్ చంద్రబోస్ నేతృత్వంలో వాల్మీకి నేతలు ఆదివారం ఢిల్లీకి బయలుదేరి వెళ్లారు. ముందుగా స్థానిక జీజీ హాస్పిటల్ ఎదురుగా ఉన్న మహర్షి వాల్మీకి విగ్రహానికి పూలమాలలు వేసి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా సుభాష్ మాట్లాడుతూ వాల్మీకి/ బోయలకు ఎస్టీ రిజర్వేషన్ కల్పించాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వానికి సిఫారసు చేశారన్నారు. ముఖ్యమంత్రి పంపిన అసెంబ్లీ తీర్మానాన్ని కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టకుండా నిర్లక్ష్యం చేస్తోందన్నారు. వాల్మీకుల ఎస్టీ రిజర్వేషన్ బిల్లు పార్లమెంట్‌లో ఆమోదించి చట్టబద్ధం చేసేదాకా ఢిల్లీ కేంద్రంగా వీఆర్‌పీఎస్ ఆధ్వర్యంలో పోరాటాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. గత సార్వత్రిక ఎన్నికలకు ముందు ప్రధాని నరేంద్రమోదీ కర్నూలులో జరిగిన బహిరంగ సభలో మాట్లాడుతూ బీజేపీ అధికారంలోకి వస్తే వాల్మీకి, బోయలకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పంపిన బిల్లును పార్లమెంట్‌లో ఆమోదించి తాను ఇచ్చిన హామీని మోదీ నిలబెట్టుకోవాలన్నారు. ఈ నేపథ్యంలోనే ఈ నెల 4,5,6 తేదిల్లో ఢిల్లీలోనే ఉండి పలువురు పార్లమెంట్ సభ్యులను కలిసి బిల్లు అంశాన్ని కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తామన్నారు. ఢిల్లీకి బయలుదేరి వెళ్లిన వారిలో కప్పట్రాళ్ల మల్లికార్జున, మురళీ నాయుడు, బోయ శ్రీరాములు, శ్రీనివాసులు, బోయ మహేంద్ర, ఎం శివ, రాముడునాయుడు, శ్రీనివాసులు తదితరులు ఉన్నారు.